

కొండ్రపోల్‌లో ఆయకట్టు భూమిలో మినుము సాగు

# ఆయకట్టులో మెట్ట పంటలు

### నాగార్జున సాగర్ జలాశయంలో నీళ్లు లేక తగ్గిన వరి

### వజీరాబాద్ మేజర్ కింద పచ్చజొన్న, పెసర, మినుము సాగు

### భూగర్భ జలంతో ఊరటనిస్తున్న చెరువులు, బోర్లు..

దామరచర్ల, డిసెంబర్ 18 : నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడంతో ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో వరి సాగు ప్రశ్నార్థకమైంది. బోర్లు వేసుకున్న రైతులు మాత్రమే ఎకరం నుంచి రెండెకరాల వరకు సాగు చేస్తున్నారు. చాలా మంది రైతులు ఆరుతడి పంటలు వేశారు. వజీరాబాద్ మేజర్ కింద దామరచర్ల మండలంలోని కొండ్రపోల్, బండావత్ తండా, బాలాజీనగర్, దిలావర్‌పూర్, కేశవాపురం, కేజేఆర్ కాలనీ, రాళ్లవాగు తండా, బొత్తలపాలెం పాత గ్రామ పంచాయతీ పరిధిలోని తండాలు, గ్రామాల్లో వరి సాగు పూర్తిగా తగ్గిపోయింది. బోర్లు ఉన్న రైతులు మాత్రమే కొద్దిపాటి భూమిలో వరి సాగు చేస్తున్నారు. మిగతా రైతులు భూమిని ఖాళీగా ఉంచకుండా పచ్చజొన్న, మినుము, పెసర పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో సుమారు 200 ఎకరాల్లో ఆరుతడి పంటలను సాగు చేస్తున్నట్లు అంచనా. మండలంలో గత ఏడాది సుమారు పది వేల ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఇప్పుడు సగానికి పడిపోయింది.



దామరచర్లలో ఆయకట్టు భూమిలో సాగు చేసిన పెసర

**ఊరటనిస్తున్న చెరువులు, బోర్లు..**

బోర్ల కింద పంటల సాగుతో కళకళలాడుతుండగా.. కాల్వ కింద భూములు వెలవెలబోతున్నాయి. మండలంలోని బోర్ల కింద సాగు చేస్తున్న రైతులకు చెరువులు కొంత ఊరటనిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ ఫలితంగా చెరువుల్లో నీళ్లు ఉండటం, భూగర్భ జలాలు పెరిగి బోర్లు పోస్తుండడంతో సమీప రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. చాలా చోట్ల ఇప్పటికే నాట్లు సైతం వేశారు. అయితే.. కాలం కలిసి వచ్చి వానలు పడితే చెరువులు పూర్తిగా నిండితే యాసంగి పంటలకు ఢోకా ఉండదని, లేదంటే కొంత ఇబ్బంది అవుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



దామరచర్ల చెరువు కింద నాట్లు పెడుతున్న కూలీలు

# ఆహ్లాదం.. పర్యాటకం

**పచ్చని కొండలు, గుట్టలతో అలరిస్తున్న దేవరకొండ ఖిలా**

**700 ఏండ్ల చరిత్ర కలిగిన గిరి దుర్గానికి స్వరాష్ట్రంలోనే గుర్తింపు**

**పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి**

**రూ.6కోట్లతో పార్కులు, సీసీ రోడ్ల నిర్మాణం**

**రాజ్యాలు అంతరించినా, రాజులు గతించినా.. నాటి రాచరిక వ్యవస్థకు స్మృతి చిహ్నంగా నిలుస్తున్నది దేవరకొండ ఖిలా. సుమారు ఏడు వందల ఏండ్ల చరిత్ర కలిగిన ఈ ఖిల్లా పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతూ పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతున్నది. ఈ ఖిల్లాకు స్వరాష్ట్రంలోనే గుర్తింపు వచ్చింది. దీన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలని కేసీఆర్ సర్కారు సంకల్పించింది. ఆ మేరకు సీసీ రోడ్లు, పార్కుల ఏర్పాటుకు రూ.6కోట్లు మంజూరు చేయగా.. పనులు కొనసాగుతున్నాయి.**

– దేవరకొండ, డిసెంబర్ 18



దేవరకొండ ఖిలా దుర్గం



దేవరకొండ ఖిలాపై ఆలయం గుట్ట

దేవరకొండ ఖిలా కొండపైన ప్రతి సంవత్సరం శివరాత్రి, ఏకాదశికి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. దేవరకొండ ఖిలాను చూసేందుకు సమీప ప్రజలే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం వస్తుంటారు. ఖిలా కొండపైన ఓంకారేశ్వర్ శివాలయం ఉన్నది. ఆ ఆలయానికి ఉత్తర భాగాన ఉన్న కోనేరులో నీళ్లు కొబ్బరి నీళ్లలా కనిపిస్తాయి. ఆ నీళ్లు తాగితే మంచి జరుగుతుందని అక్కడి ప్రజల నమ్మకం. ఏ కాలంలోనైనా కోనేరు ఎండిపోదని అక్కడి వారు చెప్తుంటారు. దేవరకొండ ఖిలాలోకి ప్రవేశించేటప్పుడు రెండు సింహ ద్వారాలు ఉంటాయి. వాటిని దాటి కోటలోకి వెళ్లగానే రేచర్ల వెలమవీరులు ఉపయోగించిన ఫిరంగులు దర్శనమిస్తాయి. ఈ విశాలమైన ప్రదేశంలో గండిపేట నీటిని తలపించేలా రెండు నీటి బావులు, రెండు కుంటలు ఉంటాయి. వాటిని ఖిలాకు కాపలా ఉండే సైన్యం తాగునీటి కోసం పయోగించేవారు. ఈ ప్రాంగణంలోనే లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, మూడు ధాన్యాగారాలు ఉన్నాయి. మూడు స్వింహద్వారాలు దాటి ఖిలాపైకి వెళ్తే రాజ్య చిహ్నమైన ధర్మచక్రం, దానికి రెండు వైపులా సింహాలు చెక్కి ఉన్నాయి. ఈ మూడు సింహద్వారాల్లో మొదటి ద్వారానికి జలచరమైన తాబేలు బొమ్మ చెక్కి ఉన్నది. మరో సింహద్వారంలో అరుగులపై సిపాయిలు ఆడుకోవడానికి పచ్చీస్, ఆటల నమూనాలు చెక్కి ఉన్నాయి. ఖిలా కోట చుట్టూ సైన్యాన్ని అప్రమత్తంగా ఉంచేందుకు 32 చిన్న ద్వారాలు ఉన్నాయి.

హైదరాబాద్ – నాగార్జునసాగర్ ప్రధాన రహదారికి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరకొండ ఖిలాకు 700 ఏండ్ల చరిత్ర ఉన్నట్లు పురాతన కట్టడాలను పట్టి తెలుస్తున్నది. దేవరకొండ చుట్టూ సుమారు 524 ఎకరాల్లో కొండలు, గుట్టలు, మైదానం ప్రాంతాల్లో ఈ దుర్గం విస్తరించి ఉన్నట్లు పురావస్తు శాఖ రికార్డులు తెలుపుతున్నాయి. ఏడు కొండలను కలుపుతూ దుర్గంగా ఏర్పడిన దేవరకొండ ఖిలాను వెలమ రాజులు పరిపాలించినట్లు చరిత్ర తెలుపుతుంది. క్రీ.శ. 1361 సంవత్సరంలో అనపోత యాదా నాయకులు రాచకొండ, దేవరకొండ దుర్గాలు నిర్మించి ప్రభువులు అయ్యారు. క్రీ.శ. 1361 నుంచి 1384 వరకు యాదానాయకుడు దేవరకొండ ఖిలా అధిపతిగా కొనసాగారు. 1384 నుంచి 1399 వరకు దేవరకొండ కోటను రెండో అనపోత నాయకుడు పరిపాలించారు. 1421 నుంచి 1430 వరకు అనపోతనేని రెండో సోదరుడు పరిపాలించాడు. 1430




ఖిలాపై ఉన్న కోనేరు

నుంచి 1475 వరకు దేవరకొండ ఖిలాను పరిపాలించిన చివరి రాజు లింగనేడు. అ తర్వాత 1482లో తక్కువ కాలం అంగనేడు దేవరకొండ ఖిలాను పరిపాలించాడు. దేవరకొండ దుర్గాన్ని యాదా నాయకుడు, మాధవరావు, పర్వత్‌రావు, నేహద్రిరావు, ధర్మారావు, లక్ష్మణ్‌రావు అనే రాజులు పరిపాలించారు. హైదరాబాద్ నవాబు దేవరకొండ కోటను సందర్శించి ఆకర్షితుడయ్యాడు. 16వ శతాబ్దంలో కులీ కుతుబ్‌షా ఈ దుర్గాన్ని ముట్టడించి దేవాలయాలను ధ్వంసం చేసినట్లు చరిత్ర ద్వారా తెలుస్తున్నది.

### పర్యాటక కేంద్రంగా..

దేవరకొండ ఖిలాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసింది. సీసీ రోడ్లు, పార్కుల ఏర్పాటుకు సుమారు రూ.6 కోట్లు మంజూరు చేశారు. ఖిలా ప్రాంగణంలో ఏర్పాటు చేసే పార్కులో చిన్న పిల్లలు మొదలుకుని పెద్దల వరకు అందరినీ ఆహ్లాదపరిచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 5ఎకరాల్లో లైబ్రరీ, ఓపెన్ ఆడిటోరియం, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తెస్తున్నారు. ఫౌంటెయిన్‌తోపాటు సేద తీరేందుకు పచ్చని గడ్డి, వివిధ రకాల మొక్కలు ఏర్పాటు చేయనున్నారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



ఖిలాపై పర్యాటకులు

# బాలికల విద్యకు భరోసా బీసీ గురుకులాలు

**కార్పొరేట్ స్థాయిలో విద్యా బోధన.. సకల వసతులు**

**ఉమ్మడి జిల్లాలో 29 బీసీ గురుకుల పాఠశాలలు**

**విద్యనభ్యసిస్తున్న 16,800 మంది విద్యార్థులు**

మిర్యాలగూడ రూరల్ : డిసెంబర్ 18 : స్వరాష్ట్రంలో కేజీ టు పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్య అందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీ గురుకుల పాఠశాలలు రెండు మాత్రమే ఉండగా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2017లో సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు 119 బీసీ గురుకులాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య చేరువ చేశారు. ఒక్కో స్కూల్‌లో 480 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు. వాటిని ఇంటర్మీడియట్‌కు అప్‌గ్రేడ్ చేయడంతో బాలికల చదువు డ్రాపవుట్ లేకుండా సాగుతున్నది.



దామరచర్ల బీసీ గురుకులంలో చదువుకుంటున్న విద్యార్థినులు

**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 29 బీసీ గురుకులాలు**

65ఏండ్ల సమైక్య పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీసీలకు రెండు గురుకుల పాఠశాలలు (నాగార్జున సాగర్, మూసీ) మాత్రమే ఉండేవి. దాంతో పేద విద్యార్థులకు గురుకుల చదువు అందని ద్రాక్షగానే ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 12 బాలుర, 12 బాలికల పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఆ తరువాత నల్లగొండ మూడు జిల్లాలుగా విభజన చేయడంతో జిల్లాకు ఒకటి చొప్పున మరో మూడు కొత్త గురుకుల స్కూళ్లను ప్రభుత్వం నెలకొల్పింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు పాత స్కూళ్లతోపాటు బాలుర 14, బాలికలవి 12.. మొత్తం 29 బీసీ గురుకుల పాఠశాలలు అందుబాటులోకి వచ్చా యి. వాటిల్లో 16,800 మంది విద్యార్థులు ఉచితంగా వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. వీటికి అనుబంధంగా 26 జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారు. గురుకులాల్లో కార్పొరేట్ స్థాయి విద్యతోపాటు పౌష్టికాహారం అంది స్తూ ఐఐటీ, నీట్, ఎంసెట్ కోచింగ్ సైతం ఇస్తున్నారు. దీంతో గురుకులాల విద్యార్థులు ఐఐటీ, బీటెక్, మెడిసిన్ సీట్లు సాధించి తమ బంగారు భవితకు బాటలు వేసుకుంటున్నారు.

### గురుకులాల్లో కార్పొరేట్ స్థాయి విద్య

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు, ఖర్చుల భారంతోపాటు బాలికల భద్రత దృష్ట్యా తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. గురుకుల పాఠశాలల్లో ఉచిత వసతి, పౌష్టికాహారంతోపాటు ఇంగ్లిషు మీడియంలో విద్య అందిస్తున్నారు. విద్యార్థుల శారీరక దారుఢ్యానికి వ్యాయామం, మానసిక వికాసానికి క్రీడలు, యోగా, మెడిటేషన్ చేయిస్తున్నారు. దీంతో గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి డిమాండ్ పెరుగుతున్నది. 2017లో ప్రారంభమైన బీసీ గురుకుల పాఠశాలల్లో 10వ తరగతి నుంచి ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేయడంతో ఉన్నత చదువులు చదివేందుకు పేద విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

### బాల్య వివాహాలకు చెక్

గురుకుల పాఠశాలల్లో సీటు రావడంతో 6వ తరగతిలో చేరిన విద్యార్థులు పదో తరగతి వరకు, ఆ తర్వాత ఇంటర్మీడియట్ కూడా అందులోనే చదువుతున్నారు. ఉచితంగా అన్ని సౌకర్యాలతో విద్య అందుతుండడంతో చదువు మధ్యలో మానేయడం తగ్గింది. ఉత్తమ విద్య అందడంతో గురుకులాల విద్యార్థులు ఎంసెట్, పాలిటెక్నిక్, ఎంబీబీఎస్ సీట్లు సాధిస్తున్నారు. దీని మూలంగా బాల్య వివాహాలను చెక్ పడినట్లయింది.

### గురుకులం వల్లే చదువు కొనసాగిస్తున్నా



మాది నకరేకల్ మండలం చందుపట్ల. నేను ఆరో తరగతి నుంచి దామరచర్ల గురుకుల స్కూల్లో చదువుతున్నా. మాది నిరుపేద కుటుంబం. మా నాన్న చనిపోయాడు. మా అమ్మ కూలినాలి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నది. నన్ను ప్రైవేటు స్కూల్లో చదివించే స్థోమత లేదు. గురుకుల పాఠశాలలో సీటు రాకపోతే నా పరిస్థితి మరోలా ఉండేది. సీఎం కేసీఆర్ మాలాంటోళ్లు బాగా చదువుకోవాలని, బాగుపడాలని గురుకుల పాఠశాలలు పెట్టాడు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకుంటా. ఇక్కడే ఇంటర్ వరకు చదువుతాను. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించి మా అమ్మను బాగా చూసుకుంటా.

**– వరికుప్పల రమణ, 10వ తరగతి, దామరచర్ల బీసీ బాలికల గురుకుల పాఠశాల**

### పేద విద్యార్థులకు వరం గురుకులాలు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి విద్య పరంగా రాష్ట్రం వెనుకబడి ఉన్నది. పేద, మధ్య తరగతి పిల్లలకు చదువుకొనే ఏర్పాట్లు చేయడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి. రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ సాహసోపేతమైన అడుగు ముందుకేశారు. ఒకేసారి రాష్ట్ర వ్యాప్తంగా 119 గురకులాలు ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించారు. ఆ గురుకులాలు పేద విద్యార్థుల పాలిట వరమయ్యాయి. గతంలో మధ్య తరగతి విద్యార్థులకు చదువుకోవాలని ఉన్నా.. వసతులు లేక తల్లిదండ్రులు చదువు మాన్పించి పనులు చేయించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. నియోజకవర్గానికి రెండు బాల, బాలికల గురుకులాలు, మైనార్టీ, ఎస్టీ, ఎస్సీ గురుకుల పాఠశాలలు నెలకొల్పడంతో పేద విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా ఈ గురుకులాలు బాలికలకు ఒక వరమనే చెప్పాలి.

**– కొండకింది నర్సింహారెడ్డి, దామరచర్ల బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్**

# క్రీడల్లో రాణిస్తున్న గురుకుల విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్, డిసెంబర్ 18 : గురుకుల పాఠశాలలు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తున్నాయి. ఈ క్రమంలో మిర్యాలగూడ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 15నుంచి 19 వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాయ్‌లో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో మిర్యాలగూడ ఎస్సీ గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సుశాంత్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నాడు. అక్టోబర్ 18 నుంచి 20 వరకు సదాశివపేటలో జరిగిన అండర్–19 ఎస్టీఎఫ్ కబడ్డీ పోటీల్లో ఇంటర్ సెకండియర్ విద్యార్థి శశికుమార్ బహుమతి సాధించాడు. అదే పాఠశాలకు చెందిన గోపీచంద్ 2022లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్‌లో అండర్–14 విభాగంలో 600 మీటర్లు, 60 మీటర్లు మరియు స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో మొత్తంగా 1620 పాయింట్లు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 2023లో రాష్ట్రస్థాయి పోటీల్లో 600మీటర్ల విభాగంలో ప్రథమ బహుమతి సాధించాడు. 2024 జనవరిలో బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.



బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన మిర్యాలగూడ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులను అభినందిస్తున్న అప్పటి ఎమ్మెల్యే భాస్కరావు (ఫైల్)

### గురుకులంలోనే బాల్ బ్యాడ్మింటన్ గురించి తెలిసింది



నేను ఐదో తరగతిలో గురుకుల పాఠశాలలో సీటు సాధించాను. స్కూల్లో మా పీఈటీ సార్ గురువయ్య, పీడీ లక్ష్మణ్ సార్ బాల్ బ్యాడ్మింటన్‌లో మెళకువలు నేర్పించారు. దీంతో పలు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. 2023 అక్టోబర్‌లో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాయ్‌లో జరిగిన పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకున్నా. గురుకులానికి రాకముందు నాకు బాల్ బ్యాడ్మింటన్ అంటే ఏందో తెలియదు. గురుకులాల వల్ల నా లాంటి ఎంతో మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే కాకుండా క్రీడల్లో కూడా రాణిస్తున్నారు. గురుకులాలు పెట్టిన కేసీఆర్ సార్‌కు ధన్యవాదాలు.

**– సుశాంత్, 9వ తరగతి, మిర్యాలగూడ ఎస్సీ గురుకుల పాఠశాల**